కథా నిలయం
శ్రీకాకుళం

# జై

పాపికొండల్లోంచి పాకుతూ చలికి గడ్డకట్టుకుపోయిన నీలం కొండచిలువలా ఉంది గోదావరి. కాలవాహినిలో కొంతసేపు ఆత్మల్లా చలిస్తూ కార్తీకంలో నదిలోకి ఒదిలే అరటిదీపాలు కనుమరుగైపోయాయి. గోదావరి చివరికంటా అంత చలిలోనూ జనం అటూ ఇటూ బారులు తీరి నుంచుని మెల్లిగా ఇళ్లకి బయలుదేరేరు. చలితోపాటు వాళ్ల శరీరాలూ హృదయాలూ ఆయన్ని చూడగానే ఝల్లుమన్నాయి. ఎవరికీ నమ్మశక్యం కాకుండా ఉంది. కొంచెం నల్లగా, చేతిలో కర్రా, భుజాల మీద అంగవస్త్రం, నెత్తిమీద ఒక గుడ్డా, వేగంగా నడుస్తూ అందరికీ చేతులు జోడిస్తూ వెళిపోతున్న వ్యక్తి గాంధీజీ అనిగానీ ప్రపంచాన్ని విస్మయ పరిచిన ప్రజానాయకుడనీ నమ్మడానికి వీల్లేకండా ఉంది. గాంధీజీ ఉదయమే గోదావరి గట్టు ఆ చివరనుంచీ ఈ చివర వరకూ నడిచి బసకి వెళ్లిపోవడం అయి పోయింది.

తలవెనక్కి వాల్చి రెండు చేతులూ పక్కమీద ఆనించి మఠం వేసుక్కూచున్నారు గాంధీజీ. కింది రోడ్డు మీద కాంగ్రెస్ సేవాదళం కార్యకర్తలు, చిన్నలూ, పెద్దలూ ఇంటి ముందు గుంపుగా ఉన్నారు. మధ్యలో అప్పుడప్పుడు గాంధీజీకి జై పైకి వినబడుతోంది. కళ్లు మూసుకుని ఆ రోజు, మర్నాటి కార్యక్రమాల్ని వింటూ చివరికి 'ఠీక్ హై' అన్నా రాయన. ఆ రోజు సీతానగరం వెళ్లాలి.

“తెలుగు పేపర్లలో ఏవుంది?” అన్నారు బాపు.

రాజమహేంద్రవరం చుట్టుపక్కల కలరా వ్యాపించింది. గ్రామాల్లో మరణాలు జరుగుతున్నాయని పత్రికల్లో వార్తలు ఒస్తు

న్నాయి. శ్రద్ధగా విన్నారు గాంధీజీ. పది నిమిషాల తరవాత రెండు ఉత్తరాలు రాసి పక్కన పెట్టి, రామచంద్రరావుగార్ని గ్రామాల్లో వైద్యసేవల గురించి అడిగేరు. విని, పెదవి విరిచేరాయన. గాంధీజీ అడిగేరు.

"ఎంతదూరం ఆ గ్రామాలు?"

"మనకి దగ్గిరిగా, రోడ్డు సౌకర్యం ఉన్నవి కోరుకొండ దగ్గిర. పది పదకొండు మైళ్లు ఉంటుంది."

"అచ్ఛా, నా లాంటి యువకుడికి పెద్ద దూరం కాదు" అన్నారు బాపు.

◆◆◆

అడవి అంచున ఉన్న గ్రామం అది. మైలు దూరంలో వాచిపోయిన పెద్ద చూపుడు వేలులాగ కోరుకొండ. ఊరు అవతల వర్షాలకి పొంగులెత్తే కొండవాగు వంపు ఊరికి ఇసక సరిహద్దు. వాగుదాటి ఎర్రటి పిండిలాంటి రోడ్డు గ్రామానికీ వాగుకీ కట్టిన ఎర్ర తాడులా ఉంటుంది. గ్రామం అంతా సన్నకారు రైతులు. ఉదయం పదకొండు దాటింది. రోడ్డు ఊరి రావిచెట్టూ, రచ్చబండా దాటి చిన్న ఒంపు తిరిగి ఊళ్లోకొస్తుంది. ఊరి మొదట్లోనే రెండుగదుల పెంకుటిల్లు చాలాకాలంగా స్కూలుగా నడుస్తోంది. రెండు సమీప గ్రామాల్నించి కూడా ఒక అరడజనుమంది విద్యార్థులు వర్షాకాలం, పొలం పనులున్న సమయంలో తప్ప ఏడాదికి కనీసం నాలుగు నెలలు స్కూలికి వచ్చి వెళుతూంటారు. వీళ్లందర్నీ ఎవరి తాటాకు చదరమీద వాళ్లనే కూచోపెట్టి నర్సింహమూర్తిగారు పాఠాలు చెప్తూంటారు. ఆయనదీ ఆ ఊరు కాదు. కొంత గాలి వల్లా కొంత పిక్క సత్తువ వల్లా సైకిలు మీద వచ్చి వెళుతూంటాడాయన.

నాలుగు లెక్కలు, రెండు వేమన పద్యాలు బోర్డు మీద రాసి కాళ్లు రెండూ కిటికీలో పడేసి మళ్లీ పేపరు తిరగేశా రాయన. మామూలుగానే నిశ్శబ్దంగా ఉండే ఊరుని ఆరోజు మరీ అంతవరకూ ఏడిచి ఏడిచి ఆపేసిన తరువాతి నిశ్శబ్దం ఆవరించింది. శీత వులో తెల్లదెయ్యంలా కలరా ఆ గ్రామాన్ని వణికించింది. స్కూల్లో విద్యార్థులు పలచబడిపోయారు. అతి కష్టం మీద నాలుగు రోజు లకోసారి పేపరు దొరుకుతుందాయనకి. కోరుకొండ సంతకి వెళ్లి నిన్ననే నర్సింహమూర్తి పత్రి సంపాయించి పిసినారితనంగా చదువు కుంటున్నారు. నిజాని కాయన చదువుతున్న పత్రిక మీద ధ్యాస ఉండడం లేదు. పత్రిక మీంచి కిటికీలోంచి బయటికి చూశారు మేష్టారు. నిన్న సాయంకాలం బూడిదైపోయిన మూడు మృతదేహాల దుర్గంధం ఊరంతా వ్యాపించి వదలడంలేదు. ఊళ్లో ఒకటే నుయ్యి. అది పూర్తిగా ఇంతవరకూ ఎండిపోలేదు. కానీ సంక్రాంతి వెళ్లిన దగ్గిర్నించీ జలతగ్గిపోతుంది. రాని కడుపు తొలిచి పూడిక తీసి చాలాకాలమైంది. పోయిన వాళ్లలో స్కూలికొచ్చే కుర్రవాడున్నాడు. వాడు పెద్దయి నర్సింహమూర్తిలాగా బెత్తం పట్టుకునే మేష్టరయి నెలకి కనీసం పదిహేను

రూపాయలు తెచ్చుకోవాలనేవాడు బులినాయుడు. మిగతా ఇద్దరూ స్కూలు వయసురాని పిల్లలు. గాంధీజీ గ్రామాలు బాగుపడాలంటున్నాడు. ఆయన దేశం అంతా తిరిగినవాడు. గాంధీజీ పేరు ఊళ్లో ఎంతమందికి తెలుసు? మనసులో లెక్కవేశా డాయన. పేరు చెప్పగానే గుర్తుపట్టేవాళ్లు అయిదుగురుంటారు. చెప్తే ఓహో అనేవాళ్లు ఇంకాసిని మంది ఉంటారు. ప్రపంచం యావత్తూ మహనీయు డనుకునే వ్యక్తి ఇక్కడ అపరిచితుడు. పత్రిక నాలుగో పుట మళ్లీ తెరిచే డాయన. ఆ పుట కింది భాగంలో వార్త మరోసారి చదివేరు మేష్టారు.

"......... బాపు రాజమహేంద్రవరం చేరుకున్నారు. పురజనులు, పురప్రముఖులు యావన్మందీ నగరానకి విచ్చేసిన అహింసా మూర్తి, అపరగౌతమబుద్ధుని యొక్క దర్శనం చేసుకుని కనులారా చూసి మనసారా శతసహస్ర నమస్కారములు సమర్పించు కొనుచున్నారు. సీతానగర ప్రజల అదృష్టమేమియో బాపూజీ ఆ గ్రామమును మహానతి కనస్తూరిబా నంచరించిన పుణ్యస్థలమును దర్శించగోరుచున్నారు."

రాజమహేంద్రవరం దూర ప్రపంచం కిందనే లెక్క. గాంధీజీ దర్శనం సామాన్య విషయం కాదు. ఆయనకి వెంటనే రాజ మహేంద్రవరం వెళ్లాలనిపించింది. రావిచెట్టు అవతల నుంచి కళ్లు నులుముకుని చూశారు. గ్రామానికి మొదటిసారిగా రెండెడ్లబండి కానీ వాహనం ఒకటి వచ్చింది. దుమ్ము కారు చుట్టూ స్థిమితపడుతోంది. ఒక్క అంగలో గుమ్మంలోంచి బయటపడ్డారు మాష్టారు. అప్పటికే ముగ్గురు వ్యక్తులు ముక్కుకి కండువా అడ్డుపెట్టుకుని దిగి నుంచుని ఉన్నారు.

"నమస్కారం. తమరు..."

"నా పేరు రామచంద్రరావు. ఈయన ఈశ్వర్రావుగారు. వారు ఉత్తరాదివారు, పేరు కేశవలాల్."

"అయ. నన్ను పాలగుమ్మి నర్సింహమూర్తి అంటారండి. ఇక్కడ టీచరుగా పనిచేస్తున్నాను."

పరిచయాలు పూర్తవకుండానే ఊళ్లోంచి నలుగురైదుగురు కారువేపు బయటుదేరేరు. ఎందుకో కారు డ్రైవరు రెండుసార్లు హారన్ మోగించాడు. ఈ కొత్తశబ్దం దరిదాపు గ్రామం అంతా వినిపించింది.

"మేష్టారూ, మీరూ ఈ గ్రామం ఎంతో పుణ్యం చేసుకున్నారు."

"అయ. అంటే..."

"మీరు టీచరుగదా! పత్రికలు చూసే ఉంటారు. గాంధీజీ రాజమహేంద్రవరాన బసచేసి ఉన్నారు. ఈ ప్రాంతంలో కలరా బాగా వ్యాపించి ఉందని చెప్పేం. చాలా బాధపడ్డారు బాపూజీ. ఒకసారి మీ ఊరు వచ్చి, మిమ్మల్ని పలకరించి వెడితేగాని

కుదరదని పట్టుపట్టేం. గాంధీజీ ఒప్పుకున్నారు. దగ్గిరిగా ఉన్న ఊరు ఇదే. ఏవంటారు? బాపూజీ మీ ఊరొస్తున్నారు."

సమాచారం ప్రభావం ఎంతగా ఉంటుందోనని నిశితంగా చూస్తున్నారు. ఆగంతకులు. అప్పటికో అరడజను మంది పోగ య్యేరు. దూరంగా మరికొంతమంది వస్తూ కనిపించారు. మేస్టారికి మాట పడిపోయింది.

"నమ్మకంగా లేదా? గాంధీజీ స్వయంగా మీ ఊరుకు వస్తున్నారు. అది చెప్పడానికి మేం ఒచ్చేం..."

"ఆ!" అనగలగేరు నర్సింహమూర్తిగారు. ఆశ్చర్యంలో ఆనందంతో మనిషి తేలికయిపోతూన్నాడాయన. చుట్టూరా చేరిన జనంతో అన్నా రాయన.

"కొమరయ్యా, మనూరుకు గాంధీజీ వస్తున్నారు."

"గాంధీగారండీ?"

"ఆ. బాపూజీ. అంటే, దేవుడు మనూరు ఒస్తున్నట్టే."

"అయ."

కొమరయ్యకీ, అతని పక్కనున్న ఇద్దరికీ బాపూజీ గ్రామం రావడం పెద్దవిశేషం అని అర్థమైంది. మిగతా గ్రామస్థులు కారునీ ఆగంతుకుల్నీ మార్చి మార్చి చూస్తున్నారు.

"కొమరయ్యా, వారిని మనింటికి తీసుకువెడదాం"

"అయ. రండయ్యగారూ. సిన్న పల్లెటూరండి మాది."

అందరూ కొమరయ్య ఇంటివేపు నడిచేరు. వాళ్లను చూసి అరుగుల మీంచి, వీధిలోకి వచ్చి పిల్లలూ పెద్దలూ పలకరిస్తున్నారు. కొమరయ్య, మేస్టారూ గాంధీజీ ఒస్తున్నారని చెప్పుకుంటూ ఇంటివేపు నడిచారు. మేస్టారు తెలుగులో ప్రసారం చేస్తున్న వార్త విని ఎవరూ ఆనందంతో మూర్ఛపోవడం, మాటపడిపోవం లేదని గమనించా రాయన. ఆడవాళ్లు తలుపుల వెనకే ఉండిపోయారు. చిన్న పెంకుటిల్లు కొమరయ్యది. అతనుకాక ఊరేగింపులో వచ్చిన ముగ్గురు గ్రామపెద్దలు, ఆగంతుకులు ఇంటిముందరి తాటాకు పందిరి కింద వేసిన మంచాల మీద కూచున్నారు. సూరిపండూ, నాగేంద్రం, నాగేంద్రం బావమరిదీ, చిన సత్తిరాజూ, కొమరయ్యా గ్రామపెద్దలు. వాళ్లయిదుగురికీ తరచుగా మేస్టారు వార్తలు చెబుతూండడం, పత్రికలో విశేషాలు చదివి వినిపించడం పరిపాటి. అందువల్ల వాళ్లకి మేస్టారి ఉత్సాహం అంటుకుంది.

"అయ. మరి గాందీగోరత్తన్నాంటే మాటలేంటండి."

"ఆరిది రాయమంద్రం కాదు గదుండీ?"

"నాగేంద్రం, వారు ఉత్తరహిందుస్థానంలో ఉంటారుగానీ, ఆ మహానుభావుడు

మనూరు ఒస్తున్నాడంటే మనం వారి  కాళ్లు కడిగి మరీ దణ్ణం ఎట్టాలన్నమాట."

కేశవ్‌లాల్ హిందీలో అన్నాడు :

"ఇది చరిత్రలో మిగిలిపోయే ఘట్టం. పూజ్యులు బాపూజీ మన గ్రామం వచ్చి మనతో మాట్లాడేరని మీ మనవలకీ మునిమనవలకీ చెప్పుకుంటారు. ఇదంతా మీ సౌభాగ్యం విశేషం." అని మేస్టారు తెలుగు చేశారు.

"సాయంకాలం వస్తా రాయన.. ఆ మేస్టారూ, ఈ గ్రామంలో హరిజనులు లేరా?" సమాధానం కొమరయ్య చెప్పేడు.

"ఓ పదేను కొంప లుంటాయండి. ఏటి దగ్గిర్లెండి. ఆళ్ల గొడవెంతుకండి?"

"అన్నన్నా అలా గనకండి. హరిజనుల్ని అంటరానివాళ్లుగా చూడరు బాపు. వాళ్లని అందుకే హరిజనులన్నారు. వాళ్లూ మనలాంటి మనుషులే. మనుషుల్లో ఈ భేదాలుండ కూడదు. భగవంతుడికి అందరూ ఒకటే గదా."

సూరిపండు అన్నాడు.

"అయన్నీ మా కెంతుకండి? మీరు పెద్దోలు."

మేస్టారు సూరిపండుని కళ్లతో వారిస్తూ వివరణ చేశారు.

"సూరిపండూ, వారు ఏవంటున్నారో నీ కర్థం కాలేదు. నేను తరువాత చెప్తాలే. అయ్యా రామచంద్రం గారూ మీరు సాక్షాత్తూ దేవతూతలమల్లే దయచేశారు. ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి. మేం చేస్తాం. అంతా ఒకటే మాట మీద ఉంటాం."

"మాకు పెద్దోరండీన. మరి ఆయనగా రేటంటే అదే.  అయ." అన్నారు నాగేంద్రం. అందరూ తలూపేరు. ఈలోగా మజ్జిగలు తెచ్చారెవరో.

"మంచిది. అయితే బాపూజీ హరిజనుల్ని కలిసి మాట్లాడతారు. వారు రాగానే వీళ్లని కూడా ఆదరంగా పిలవండి". మరో పది నిముషాలపాటు రామచంద్రంగారు గాంధీజీ పర్యటన వివరాలు చర్చించి లేచేరు. లేస్తూండగా  ఈశ్వర్రావుగారు బులివాయుడు గారింటికి వెడదామన్నారు. తల వెనక్కి తిప్పి చూశారు మేస్టారు. బులివాయుడు వెనగ్గా నుంచుని ఉన్నారు. మేస్టారు తలూపగానే దగ్గిరి కొచ్చేడతను.

"వాయుడూ, ఒకసారి మీ ఇంటికి వెళ్లి వెడతామంటున్నారు వారు."

చుట్టూరా జనం నుంచుని ఉన్నారు. ఎవరో కొత్తవ్యక్తి ఊళ్లోకి వస్తునాడని వారికి స్పష్టంగా అర్థం అయింది. రామచంద్ర రావుగారు గొంతు సవరించుకుని అన్నారు.

"కొమరయ్యగారూ, బాపూజీ ఆవలెల్లుండి, అంటే సరిగ్గా రెండు రోజుల్లో మీ ఊరు వచ్చి మిమ్మల్ని పలకరించి కాసేపు కూచుని వెళ్లిపోతారు"

"అయ... అంటే, ఎంతుకండీ?"

"బాపూజీకి గ్రామాలంటే ప్రాణం.. అందులో ఈ ప్రాంతాల్లో ఆరోగ్యపరిస్థితులూ, వైద్యసౌకర్యాలూ సరిగాలేవని విని మిమ్మల్ని పలకరించి వెడదామని అనుకుంటున్నారు."

"అయ. మంచిదే గదండి."

"మంచిదేగాదు. సాక్షాత్తూ మన కోరుకొండ నరసింహస్వామి ఒస్తే ఎంత ఇదీ అంతే." అన్నారు రామచంద్రరావు గారు. అది విన్న జనంలో ప్రత్యేకంగా ఎటువంటి కదలికా లేదని గమనించి ఆయన కొంచెం నొచ్చుకున్నారు. నాగేంద్రం ఏవీ అనలేరుగాని చిన సత్తిరాజు అన్నాడు :

"అంటే... ఆయనగారికి బోయినాలూ గట్టా... అరు బేమర్లాండి? కోణ్ణీ గట్టా కొయ్యమంటే తప్ప దనుకోండి. అంటే తెలవక అడుతున్నానండి. అయ."

నరసింహమూర్తిగారికి కొంచెం కోపం వచ్చింది.

"ఒరేయి సత్తిరాజూ, ఆ మహానుభావుడు 'ఇక్కడ భోయినానికి కాదురావడం. సుబ్బయ్యా, బులినాయుడూ వాళ్లని ఓదార్చి వెడదామని. స్త్రీలకి రెండు మంచి మాటలు చెప్తారు. పైగా ఆయన నెవరనుకున్నావు? కోళ్లూ అవీ తిన రాయన."

నాగేంద్ర అన్నాడు.

"బోయినం కాదుగానీ రాజూ ఒక మగానుబావుడు ఈడకి రావడం ఇదన్నమాట. అంతేగదండీ?" ఎందుకో కేశవలాల్ చిరునవ్వేడు. మళ్లీ రామచంద్రంగారన్నారు

"మరి అదీ సంగతి. బాపూజీ భోజనం చెయ్యరు. మీ ఊరు చూస్తారు. ఊరు కాస్త శుభ్రం చెయ్యండి. మేస్టారూ, పిల్లలంటే బాపూజీకి ప్రాణం. స్కూలికి కూడా వస్తారు."

"మహద్భాగ్యం."

క్షణం సందేహించి దారితీశాడు నాయుడు. గదిన్నర పెంకుటిల్లు నాయుడిది. ముందు పల్చబడిన తాటాకుపందిరి మీదికి పచ్చటి తీగ ఏదో బాగా అలుముకుంటోంది. అందరూ పందిరి ఇవతల ఆగిపోయేరు. రెండు కోడి పిల్లలు కంగారుపడి ఇంటి వెనక్కి పరిగెట్టేయి. తలుపు నెట్టేడు బులినాయుడు. లోపల చీకటిగా ఉంది. నాయుడు ఇల్లాలు చాపమీద ఒత్తిగిలి పడుకుని నిద్రపోతోంది. తలుపు తీసిన లేత వెలుగు ఆమె మీద పడుతోంది. నిశ్శబ్దంగా వెనక్కి తిరిగి వెంకటసుబ్బయ్య ఇంటికి బయలుదేరే రందరూ. కుర్రాళ్లిద్దరు ముందు కెళ్లి చెప్పేరు. సుబ్బయ్య భార్యని ఓదార్చడం వాళ్ల వల్ల కాలేదు.

అందరూ కారు దగ్గిరికి వెళ్లేరు. స్కూలు ఒదిలేసి ఉన్న ముగ్గురు పిల్లలూ కారు చుట్టూ చేరేరు. అందరికీ నమస్కరించేరు ఆగంతుకులు. దుమ్మురేపుకుంటూ

వెళ్లిపోయింది కారు. అందరూ రచ్చబండ మీద కూచున్నారు.

"ఏటంతా రిదంతా?" అన్నారెవరో.

"నే చెప్పేది జాగ్రత్తగా వినండి. రెండ్రోజులు కూడా సమయం లేదు. ఉన్న నాలుగు వీధులూ ముందు శుభ్రం చేయించండి. గాంధీగారికి మన వేవీ ఇవ్వక్ఖర్లేదు. కాసిని జాంపళ్లూ, అరటిపళ్లూ పెడదాం. ఏం? బాపూజీ తీసుకుంటే సంతోషం."

గొల్ల కోటయ్య మేస్టార్ని ఆపి అన్నాడు.

'కాదండి. ఇంతకీ బాపన్నగోరూ గాందిగోరూ ఒత్తన్నా రన్నమాట. అంతేనంటారా? ఒచ్చి కుంచేపు కూకుని మంచీసెబ్బరా మాతాడి ఎల్తారన్నమాట ఆయ."

మేస్టారు పెద్దగా నవ్వేరు.

"చంపేశావురా బాబూ. బాపన్నగారూ, గాంధీగారూ ఒకటే. బాపన్నగారు గాదు. బాపు. అంటే తండ్రి అని అర్థం. మన దేశ ప్రజ లందరికీ తండ్రి లాంటివా రన్నమాట."

"ఆయ. తెలవలేదండి మారి." కోటయ్య కూడా నవ్వుకున్నాడు.

మళ్లీ మేస్టారే అన్నారు :

"గాంధీజీ ఎప్పుడూ మేకపాలే తాగుతారు." కోటయ్య సంతోషంగా తలూపేడు.

"ఇప్పుడు దేశాన్ని పాలించే తెల్లదొరలకి ఆయనంటే భయం."

"అయిబాబోయి. ఆయ?"

"ఆ. మరదే. అటువంటి గొప్ప వ్యక్తి ఆయన."

నాగేంద్ర ఇంక ఉండబట్టలేకపోయాడు.

"అవుననుకోండి. ఈ మాలోళ్ల గొడవేటండి? ఆళ్లందర్నీ ఈడకి రప్పింతారా?"

కొమరయ్య సాభిప్రాయంగా తల ఊపేడు.

"అదలా ఉంచండి. తరవాత మాటాడదాం."

"మరి గాందీగోరు బేమర్లంటారా, కాపులా?"

"సత్తిరాజూ, నేను బాపూజీ గురించి రేపు సవిస్తరంగా మీ అందరికీ చెప్తాను. మనందరం ఆయన రాగానే ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి; ఇదాలోచించాలి. చాలా క్రమశిక్షణగా ఉండాలిసుమా. ఆడవాళ్లందరినీ పోగేసి ఓసారి మాట్లాడాలి ఏం? మీరు కంగారు పడకండి. నే నున్నానుగదా. నే చెప్తాను."

◆◆◆

ఆ రోజు ఆ మర్నాడూ నర్సింహమూర్తిగారు ఏదో ఆవహించినట్టు పనిచేశారు. ఆ రాత్రి ఇంటికి వెళ్లి, కాళ్లు కడుక్కుంటూనే కాసేపట్లో పేలిపోయే బుడగలాగ "ఏవేవ్ గాంధీజీ ఒస్తున్నారు." అని కేకేశారు. గాంధీజీని చూడ్డం, ఆయనతో మాట్లాడ్డం అనే

అయాచితమైన అదృష్టం ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఆ మధ్యాన్నం అంతా ఉన్న పదిమంది పిల్లలకీ గాంధీజీ గురించి చెప్పేరు. చెప్పకముందూ, చెప్పిన తరవాతా కూడా పిల్లలు మామూలుగానే ఉన్నారు. ("స్కూలు ప్రాంతాల్లో ఉచ్చోశారో గోడకుర్చీ వేయిస్తాను.") బాపూజీ వచ్చేరోజు అందరూ శుభ్రంగా తలస్నానం చెయ్యాలి, తలకి నూనె పెట్టుకుని సరిగ్గా దువ్వుకుని రావాలి. రెండు, ఊరి పిల్లలందరూ రెండు వరసలుగా నిలబడి గాంధీజీ కారు దిగ్గానే "గాందీజీకీ జై" అని మూడుసార్లు అనాలి. రెండు చేతులూ కలిపి నమస్కారం చెయ్యాలి. స్కూలు చుట్టూరా ఎక్కడా కాయితం ముక్కగానీ చెత్తగానీ ఉండకూడదు.

సాయంత్రం కొమరయ్య ఇంటిదగ్గర దరిదాపు ఊరంతా దిగింది. నర్సింహమూర్తిగారు గాంధీజీ గురించి అరగంట మాట్లాడేరు. హరిజనోద్ధరణ, సత్యాగ్రహం, హరిజనుల ఆలయప్రవేశం వంటి వెన్నో ఉదహరించే రాయన. శ్రద్ధగా విన్నారంతా. ఆయన చెప్పిన విషయాలు రెండే స్పష్టంగా అర్థమయ్యాయి. ఒకటి గాంధీజీ గొప్పవాడనీ, రెండోది అంటరానితనం ఆయన ఒప్పుకోరనీ. ఉప న్యాసం విని కొందరు వెళ్లిపోయారు. ఇంక ఆడవాళ్లు మిగిలేరు. వాళ్లతో మాట్లాడాలి. ఆలోచనల్లోంచి తేరుకుని చూసేసరికి కొమ రయ్యవాళ్లూ ఉప్పు సత్యాగ్రహం గురించి విన్న వైస్రాయిల్లా మొహాలు పెట్టారు. క్షణం చూసి మేస్టారే అడిగేరు.

"ఏవిటి ఆలోచనల్లో పడ్డారు."

ఆయనవేపు ఇబ్బందిగా చూసి మొత్తానికి కొమరయ్య అందరి తరఫునా మాట్లాడేడు.

"ఆయ. అంటే బానే ఉందనుకోండి. ఉప్పుడు, మగానుబావుల్ని సూట్టం మాట్లేటండి?"

"అదే అటున్నాను."

"ఆయ... ఏటంటేనండి. పోనీ ఆర్ని మళ్లీ ఓపాలి రమ్మంటే బావుంటదేమో సూడండి...."

నర్సింహమూర్తిగారికి మతిపోయింది.

"ఏవిటీ గాంధీగార్ని మరోసారి రమ్మందావా?!"

"ఆయ. ఇప్పుడారొచ్చి ఈడకి మాలోళ్లందర్నీ గుడికాడికి రమ్మంటే కుదురుద్దేటండి? ఆరు గొప్పోరేననుకోండి. కాదంటావే టండి. ఈడ పద్దవతులున్నాయి గదండి మరీ. మరి మీరే చెప్పాల."

మేస్టారికి కాస్త ఊపిరందింది.

"అదా మీ సమస్య? హరిజనుల ఆలయప్రవేశం అంటే వారు ఇక్కడి కొచ్చి

అదేవీ చెయ్యరు. అంటరానితనం తప్పని చెప్తూ ఇది కూడా న్యాయం కాదంటారు గాంధీజీ. సరే. మీకేం భయం లేదు. అవేం జరగవిక్కడ. ఏవంటారు?"

"మీ రలగంటే ఇంక అంతేనండి. అయ."

"హరిజనవాడకి ఎవర్నేనా పంపించాలి. బాపూజీ హరిజనులతో మాట్లాడతానంటున్నారు.".

"మనకి బాదేవుంది లెండి. అర్ని ఎల్లి రమ్మంటే సరి." అన్నాడు సూరిపండు.

మేస్టారికి ఏం చెప్పాలో అర్థంకాలేదు. ఆలోచలో పడి చివరికి అన్నాడాయన.

"వారిని అక్కడికి వెళ్లండని చెప్పడం మర్యాదకాదు. హరిజనులనే కొందర్ని పిలిపించడం మంచిది."

"అదేనండి మరి. అది పద్దవతి కాదు గదండి."

ఏవనుకున్నాడో గొల్ల కోటయ్య సమాధానం చెప్పేడు.

"అదిగాదొరే సూరిపండూ, నేనో మాటంటాను, ఆలకింతావా?"

"చెప్పవో. నీకంటే నేట్రా?"

"బాపన్నగోరు మాలోళ్లు కావాలంటున్నారు. ఈరు ఆడకేనా ఎల్లాల అళ్లీడకేనా రావాల. అంతుకనీ ఈ గొడవెంతుకు ఈన ఆడకే లేదు, ఆల్లీడకీ లేదెహె. ఏతంటే మాలోళ్లని రమ్మని ఇస్కూ లవతల కూకోబెట్టండి. బాపన్నగారు ఆడకెల్తారు. ఏట్రా? ఆ రెంట పదడుగులు మనం ఎల్తాం."

అందరికీ వెంటనే నచ్చింది. నర్సింహమూర్తిగారికి మతిపోయి కోటయ్య వేపు చూశారు. కోటయ్య కొంచెం సిగ్గులాంటిది పడి అన్నాడు.

"తప్పంటారా?"

"నీ మొహం. తప్పుగాదు సరిగదా మంచి పరిష్కారం చూపించేవు. అలా చేద్దాం. మనం మీనమేషాలు లెక్కపెట్టడానికి సమయం లేదు. ఉదయవే ఎవర్నేనా వాళ్లకి కబురు చెప్పి అవలెల్లుండి సాయంకాలం స్కూలవతలకొచ్చి కూచోమనండి."

"కాస్తంత కల్లాపి జల్లమని ఆడంగులికి చెప్పాల. నాలుగేపులా సుబ్రం గుండాలమరి."

"సత్తిరాజూ ఆ శుభ్రం పనులు నువ్వు చూసుకో. రచ్చబండ దగ్గిర కూడా బాగు చేయించు."

"అయ."

"మరి నేను బయల్దేరతాను. తొరగా చీకటి పడుతుంది." అంటూ లేచేరు మేస్టారు. అందరూ తలూపేరు. ఆయన లేచి స్కూలువేపు బయల్దేరేరు. సైకిలక్కడే ఉంటుంది.

ఆయనతోపాటు నడుస్తూ కోటయ్యస్కూలు వరకూ వచ్చేడు. ఆయన సైకిలు తీస్తూండగా అడిగేడు.

"మరి మన బాపన్నగోరు బేమర్లాండి."

"కాదు. మనం కోమట్లాంటాం చూడు. ఆ కులం."

"ఆయ. ఇంటికాడ యాపారం గట్టా ఉందన్నమాట."

"అదేం లేదు. ఆయనకేవీ లేదు. జీవితాన్ని దేశానికి అంకితం చేశారు."

"ఆయ. అంతేగదుండి మరి. ఉంటా నండాయ."

నిజానికి బాపూజీ వ్యాపారం మానేసి దేశం కోసం తిరగడం కోటయ్యకి అంతగా నచ్చలేదు.

మర్నాడు పదకొండు దాటిం తరవాత నర్సింహమూర్తిగారు పిల్లలందరిచేతా "గాంధీజీకీ జై" అనిపించగలిగేరు. ఊళ్లో చిన్న పిల్లల్ని కూడా పిలిపించి అందర్నీ రావిచెట్టు దగ్గిరికి తీసుకెళ్లేరాయన. ఎత్తుల ప్రకారం రెండు వరసల్లో నిలబెట్టి గాంధీజీ రాగానే ఏం చెయ్యాలో చేసి చూపించేరు. అదయ్యేసరికి నిజంగానే తలపోటు వచ్చిందాయనికి. కుర్రాళ్లందరూ గాంధీజీకి జై అని అరుస్తూ స్కూలుకి పరిగెట్టారు. అప్పుడు విచారించేరు నర్సింహమూర్తిగారు. పిల్ల వెధవ లెవరూ జీ అనలేరు. బాపూకీ జై నేర్పవలసింది. ఊళ్లోకి నడిచే రాయన. సూరిపండు ఇంటిపక్క సందులోంచి బయటపడి రామాలయం దగ్గిరికి వెళ్లేడాయన. నాలుగైదు ఆకాశన్నంటే చింత చెట్లూ, పక్కనే ఇటుకలతో ఎప్పుడో కట్టిన చిన్న రామాలయం ముందు ఆడంగులందరూ నుంచునీ కూచునీ కబుర్లు చెప్పుకుంటునానరు. మేస్టార్ని చూడగానే అందరూ మాటలాపి లేచి నుంచున్నారు. వెళ్లి ఆలయం మెట్లమీద కూచున్నారాయన. నోరు విప్పేలోగా సత్తిరాజు హరిజనవాడకి పంపిన మనిషి వచ్చేడు. మొహం తువాల్తో తుడుచుకుంటూ చెప్పే డతను.

"ఆయ. మావోళ్లకాడి కెళ్లేనండి. కేకేసేనండి. ఒచ్చేత్తావన్నారండి. ఇస్కూలు అవతలగా కూకోమన్నానండి."

"ఏం చెప్పేవు?"

"అదేనండి. గాంధీగోరన్చెప్పేనండి. ఆళ్లకి తెల్లేదండి. ఆరు మగానుబావుడోరే, దేవుళ్లాటారన్నమాట. మేకపాలుచ్చుకుంటారు. బోయినంగట్టా చెయ్యరన్నానండి. అంతేగదండి."

గాంధీజీ జీవితాశయాన్ని ఒక్క వాక్యంలో కుదించేసరికి మేస్టారికి ఎక్కడలేని నీరసం ఒచ్చింది. "సరేపో." అనగలిగేరాయన. ఆడంగు లందరివేపూ ఒకసారి చూసి మేస్టారు గాంధీజీ గురించి, స్త్రీ విద్య గురించీ, స్త్రీల ఆరోగ్య రక్షణ గురించీ బాపు అభిప్రాయాల్ని

వివరించేరు. అందులో గాంధీజీ పేరు తెలిసిన మహిళలు నలుగురున్నారు. మొత్తాని కందరూ ఒక మహాత్ముడు, ఒక సాధువు గ్రామం ఒస్తున్నాడని సంతోషించేరు.( "అంటే అరు సాదువుగారన్నమాట. బక్తులు, అడివిల్లో కూసుని తపసీగట్టాచేసీవోరు." )

"గాంధీజీకి ఇష్టమైన భజనపాట ఒకటి రెండు వాక్యాలు మీరు నేర్చుకుని ఆయన రాగానే పాడాలన్నమాట." అన్నారు మేస్టారు. వెంటనే ఆడవాళ్లందరూ కొంగులు నోట్లో పెట్టుకుని నవ్వి "మాకు పాట్లేటండి." అన్నారు. అందులో కాస్త చనువున్న నర్సమ్మ అంది.

'మాకు పాటలురావండి మరి. అందులో ఆ రెవరో పెద్దోల ముందు పాట్టం చాతరాదండి."

"నే చెప్పేది కాస్త వినండి. ఇది మామూలు దేవుడిపాట. రాములవారి మీద పాట నర్సమ్మా. అది గాంధీజీకి ఇష్టమైన పాట. పాట పూర్తిగా పాడమనడం లేదు. రెండు వాక్యాలంతే. నేను పాడి వినిపిస్తాను. ఇంకోటి, మీ రందరూ కలిసి పాడాలి గనక భయం లేదు. ఏం? నేను పాడి వినిపిస్తాను."

నర్సింహమూర్తిగారు 'రఘుపతి రాఘవ రాజారాం' పాడేరు. రెండు వాక్యాలూ నాలుగుసార్లు పాడేరు. ముందు ఆడవాళ్లందర్నీ మూడు వరసల్లో నిలబెట్టి పాట సాధకం చేయించారు. చివరిగా వాళ్లతో గొంతు కలపడం మానేసి వినడానికి సిద్ధపడ్డా డాయన. మళ్లీ ఒకసారి గొంతులు సర్దుకుని, తలలు ఒంచుకుని మొదలు పెట్టేరు. "ఆఆఆఆ రగుప్రతి రాగవరాజీరాం, ప్రతీత..." రెండు నిముషాల తరవాత మేస్టారికి తాను ఏదో మెత్తటి ద్రవం, ఘనంగాని గుంటలో కూరుకుపోతున్నట్టనిపించింది. ఒక పాటలో రెండే వాక్యాలు ఇంతమంది ఇన్ని రకాలుగా, ఇన్ని అర్థాలతో శృతులతో పాడగలరని ఆయన ఊహించలేదు. ముందు చుక్కాల నర్సమ్మ ఆతో దీర్ఘం తీసి 'రగుప్రతి' అనగానే వెనకవాళ్లందరూ రాజీరాం అని అందుకున్నారు. కాసేపు సాధకం అయిం తరవాత మొగోరికి అన్నంపెట్టుకోవాలంటూ అందరూ వెళ్లిపోయారు. మేస్టారు కాళ్లీడుచుకుంటూ స్కూలికి వెళ్లిపోయారు. భోజనం మీద ధ్యాసపోయిం దాయనకి.

సాయంకాలం మరికాసేపు పాట సాధకం అయిం తరవాత నాలుగు వీధులూ తిరిగి వచ్చేరు నర్సింహమూర్తిగారు. అద్దంలా కాకపోయినా మొత్తానికి వీధులు బాగానే ఉన్నాయి. ఊరి మొదట్లో ఉన్న రెండు ఆముదం వీధిదీపాల్నీ ఎవరో శుభ్రం చేశారు. రావిచెట్టు దగ్గిర కూడా శుభ్రంగానే ఉంది. పిల్లలకి నిన్నట్నించీ గాంధీజీకి బదులు బాపూకీ జై నేర్పించారు. పాటకూడా రఘుపతి రాఘవ రాజారాం వంటిదే తయారైంది. మళ్లీ చాలామంది సాయంకాలం రావిచెట్టు దగ్గిర సమావేశం అయ్యేరు. నర్సింహమూర్తిగారి ఉత్సాహం, భక్తీ, ఉద్వేగం మొత్తానికి చాలామందికి సోకింది. మర్నాటి సాయంకాలం గ్రామంలోకి అడుగుపెట్టబోయే మహనీ యుడి కోసం తెలిసో

తెలియకో అందరూ పండగ ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు.

"మరి బాపన్నగోరు ఈణ్నే కూకుంటా రంటారా?" రచ్చబండని చూపిస్తూ నత్తు సవరించుకుంటూ అడిగేడు గొల్ల కోటయ్య.

"ఇక్కడే అంటే దీని మీద కాదు. స్కూలు కుర్చీలు రెండు తెప్పిస్తాను. టేబులు కూడా ఉంది. బాపూజీ మరొకరూ కూచుం టారంతే. అందరికీ కుర్చీలు మనదగ్గరెక్కడుంటాయి?" అన్నారు మేస్టారు. మర్నాటి కార్యక్రమాన్ని అందరూ మరోసారి గుర్తు చేసుకున్నారు.

సాయంకాలం నాలుగవుతోంది. అడవి చీకట్లు సందేహిస్తూ గ్రామంవేపు పరుచుకుంటున్నాయి. రావి చెట్టు దగ్గర పిల్లలు అప్పటికే వరసగా నిలబడి కాళ్లు నెప్పులనీ, ఒంటేలు పోసుకోడానికనీ వెళ్లి తిరిగ్గా వస్తున్నారు. ఆడవాళ్లు ఒకపక్క ఊరి మగవాళ్లు ముందు వేపూ నుంచుని ఉన్నారు. పాతికమంది చిన్నా పెద్దా హరిజనులు రావడం చూశాడు సత్తిరాజు. వెంటనే మనిషిని పంపించి వాళ్లు ఎక్కడ ఆగాలో చెప్పిరమ్మని పురమాయించాడు. అప్పటికి వాళ్లని అందరూ చూశారు. కానీ కారు దిగినవాళ్లకి అక్కడ నుంచున్న జనం కనిపించే అవకాశం లేదు.

"అసలియ్యాలికి వత్తారంటారా?" అన్నా రెవరో.

"వారు మాట ఇచ్చిన తరవాతను హరిమీద గిరిపడ్డా ఒచ్చి తీరుతారు. పైగా దార్లో మరి వారొస్తుంటే ఆపి దర్శనం చేసుకుని మరీ విడుస్తారు. అవునా?" అన్నారు మేస్టారు. ఇది అందరికీ సబబుగానే కనిపించింది. గొల్ల కోటయ్య దూరంగా వెళ్లి చుట్ట వెలిగించి, కొప్పులో ఎట్టుకున్న పువ్వుని తడిమి చూసుకున్నాడు.

"ఒచ్చేత్తన్నార్రా." అరిచారెవరో.

దుమ్ము లేపుకుంటూ కారు వస్తోంది. కుర్రాళ్లందరూ సద్దుకుని నుంచున్నారు. ఆడంగులందరూ ఒక అడుగు వెనక్కి వేసి కొంగులు పూర్తిగా కప్పుకుని చూశారు. ఎర్రటి ధూళిమేఘాన్ని విస్తరిస్తూ కారు నెమ్మదిగా రావిచెట్టు పక్కగా ఆగింది. మేస్టారూ, మరో పదిమందీ సభక్తికంగా కారువేపు వెళ్లేరు. ముందు కేశవలాల్, రామచంద్ర రావుగారూ, ఈశ్వర్రావుగారూ కారు దిగి బయటపడేలోగా కర్ర బయటపెట్టి ఒక్క అంగలో కారు పక్కన ఒచ్చి నిలబడ్డారు గాంధీజీ. ముందు ఆ పెద్ద చెవి నుంచి ఈ పెద్ద చెవి కలుపుతూ విశాలంగా నవ్వేరాయన. అసంకల్పితంగా అందరూ రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెడుతూ నిలబడిపోయారు. క్షణంలో తేరుకున్నారు మేస్టారు. ఒంగి బాపూజీ కాళ్లకి మళ్లీ నమస్కరించి లేచి నుంచున్నారు. ఆయన కళ్లు చెమర్చేయి. ఆయన వెనక నుంచున్న పది మందీ చటుక్కున బాపూజీ పాదాలు స్పృశించారు. మళ్లీ ఓసారి అందరివేపూ చూసి నవ్వుతూ ప్రతి నమస్కారం చేశారు గాంధీజీ. కుర్చీలో కూచుని పిల్లలవేపు అప్పుడు చూశారాయన. ఆయనకి కనిపించకుండా చెయ్యి

ఊపేరు మూస్టారు. ముందు నోళ్లు పెగలగపోయినా మొత్తానికి పిల్లలందరూ బాకీ జాయ్ అని అరిచేరు. ఆడవాళ్లకి మాత్రం రెండు దఫాలుగా నోరొచ్చింది. మేస్టారి సైగ చూసి ముందు పదిమందీ అలవాటు చొప్పున పాటకి ముందు ఆఅ... రాగం తియ్యగానే వెనక నుంచున్న వాళ్లు అందుకుని, "ప్రతీతపావన సీతారాం" అన్నారు. గాంధీజీ పాట వినలేదు. మేస్టారు వినయంగా తనని పరిచయం చేసుకుని పక్కనున్న వాళ్లని పరిచయం చేశారు. కోటయ్యని చూసి కొప్పులో పువ్వుని ముట్టుకున్నారాయన. మేస్టార్ని చూస్తూ అడిగేరు బాపు.

"మొన్న ఇక్కడ చనిపోయినవారి తాలూకు ఎవరున్నారు?"

బులినాయుడూ, వెంకటసుబ్బయ్యా మందుకు వచ్చి నుంచున్నారు. బాపు మరణించినవారి వివరాలు అడుగుతున్నారు. మేస్టారు దుబాసీ. బాపన్నగార్ని చూస్తూ మానులాగ నిలబడిపోయాడు కోటయ్య. మోకాళ్లమీదికి కట్టిన పంచ, భుజం మీద శాలువా, చేత కర్రా, తనెప్పుడూ వినని భాషలో మాట్లాడే ఆ పరదేశిని చూసేకొద్దీ అతనికి తెలీకుండానే బలమైన భక్తిభావం ఏర్పడింది. కలరా గురించి అడుగుతూ బాపూజీ మరణించినవారి కుటుంబాల్లో స్త్రీలని పిలిపించారు. సుబ్బయ్య భార్య, నాయుడు భార్య మరో ఇద్దరు స్త్రీలూ ముందు కొచ్చేరు. కళ్లప్పగించి ఆయన్ని చూస్తూ, ఆయన్ని సమీపించగానే బాపు లేచి వాళ్ల తలల మీద చెయ్యివేసి "ఎలా ఉన్నారు తల్లీ?" అన్నారు. అనుకోకుండా పొంగిన కొండవాగులా ఆయన చేతులు పట్టుకుని గొల్లుమన్నారు వాళ్లు. వాళ్లని ఓదారుస్తూ ఇద్దరి భుజాలమీదా చేతులు వేసి పిల్లల వేపు నడిచేరాయన. పిల్లల్ని వాళ్ల పాఠాల గురించీ, ఆరోగ్యం గురించీ అడిగి తెలుసుకున్నారు. ఊరి గురించి, పొలాల గురించీ, పంటలు, పశుపోషణ గురించీ అడుగుతూండగా మేస్టారు కోటయ్యని చూపించి అతను యాదవుడనీ గొర్రెల్ని మేకల్నీ పెంచుతాడని చెప్పేరు.

"అచ్ఛా, యాదవులు నాకు తెలీకపోవడమేమిటి? మా సౌరాష్ట్ర అంతావాళ్లే." అన్నారు బాపు. ఊరి జనాభా గురించి వాకబు చేస్తూ వైద్య సదుపాయం, ఆయుర్వేద వైద్యులెవరైనా ఉన్నారా అని అడిగేరు. కనీసం ఆయుర్వేద వైద్యుణ్ని ఎవరినైనా ప్రతీవారం ఒచ్చే ఏర్పాటు చేసుకోండి" అంటూ పిల్లల్ని ఆడా మగా తేడా లేకుండా చదివించండి. మన గ్రామాలు ఇలా ఉంటే ఎలాగ? రగామాలే దేశానికి అన్నం పెడుతున్నాయి." అన్నారు గాంధీజీ. క్షణం ఆగి ఆయనే చకచక ఊరివేపు నడిచేరు. ఉన్న నాలుగు వీధులూ తిరుగుతూ సత్తిరాజు ఇంటివేపు తిరిగే రందరూ. సత్తిరాజు మేనల్లుడు నాలుగేళ్లవాడు అరుగుమీంచి రోడ్డు మీదికి శ్రద్ధగా ఉచ్చపోస్తున్నాడు. హఠాత్తుగా జనం సందు మలుపు తిరగ్గానే కంగారుపడి కాళ్లు తడిపేసుకున్నాడు. అయితే ఊరేగింపు ఎదురింటి వేపు వెళ్లడంతో, మధ్యలో ఆపిన కార్యక్రమం వాడు పూర్తిచేశాడు.

ఇళ్లలో ఉండిపోయిన ఆడవాళ్లతో ఎక్కువగా మాట్లాడేరు గాంధీజీ. నీళ్లు కాచి చల్లార్చి తాగడం ఎంతమంచిదో పదిసార్లు వివరించి చెప్పేరాయన. మొలకి ఉన్న వాచీ చూసుకని "పదండి" అన్నారాయన. రావి చెట్టు దగ్గిరికి వచ్చి నుంచున్నారందరూ. స్కూలు వేపు ఎక్కువమంది దడికట్టినట్టు నుంచోడం గమనించారు నర్సింహ మూర్తిగారు. కొమరయ్యా వాళ్లూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. చటుక్కున బాపూజీ మేస్టార్ని అడిగారు :

"మాస్టర్జీ, మీ ఊళ్లో హరిజనులు ఉన్నారా?"

అప్పటికే చీకటి పల్చగా ఊరు నాక్రమించింది. గాంధీజీ ముందు నడుస్తుండగా జనం ఆయనకి కొంచెం వెనగా నడుస్తున్నారు. చిరుచీకట్లో నీడల గుంపులా కూచున్నారు వాళ్లంతా. దగ్గిరికి రాగానే అందరూ లేచి నుంచున్నారు.

"దండాలండి బావూ." అన్నారు వాళ్లు. వాళ్ల వృత్తి గురించీ, ఆరోగ్యం గురించీ, కల్లు గురించీ అడిగేరు గాంధీజీ. అందులో ముందునుంచున్న ఇద్దరి పిల్లల్ని చూసి "మీ స్కూలికి వీళ్లు రారు. అవునా?" అన్నా రాయన. అవునని తలూపేరు మేస్టారు. "వాళ్ల రావాలి". అంటూ పిల్లల్ని దగ్గిరికి పిలిచేరు. వెనక దూరంగా నుంచున్న వాళ్లందరి గుండెలూ ఆగి కొట్టుకున్నాయి. ఆయన ఎదుట నుంచున్న వాళ్లకి ఊపిరి బిగుసుకుపోయింది. ఏం జరుగుతోందో మాత్రం తెలీడం లేదు.

మళ్లీ అందరూ రావిచెట్టు దగ్గిరికి వచ్చేరు. అప్పటికి టేబులు మీద ఒక డజను అరటి పళ్లూ, కాసిని జామ పళ్లూ తెచ్చి పెట్టేరు. వాటని పిల్లలకి ఇచ్చేరు బాపు. గాంధీజీ అందరివేపూ చూస్తూ నమస్కరిస్తూ చటుక్కున వెనక్కి తిరిగి నాలుగంగల్లో కారు దగ్గిరికి వెళ్లేరు. అందరూ గాంధీజీకి నమస్కరిస్తూండగా కారు బయలుదేరింది. వేగం అందుకోగానే సాయంత్రం గాలివాటున కారు రేపిన ఎర్ర దుమ్ము జనం మీదుగా ఊరివేపు వెళ్లింది. పండగ అయిపోయింది. అందరూ నిశ్శబ్దంగా మళ్లీ పాత గ్రామంలో నడు స్తున్నారు. అప్పుడే ఊరి వీధి దీపం ఒకటి వెలిగింది. స్కూలు ఆవల అంతసేపూ నుంచున్న వాళ్లంతా చీకట్లో కలిసిపోతూ వాడవేపు బయలుదేరేరు.